# అర్హులకు ఇండ్లు మంజూరు చేయాలి

### కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

లింగంపేట, ఏప్రిల్23 : అర్హులైన వారికి ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశించారు. లింగంపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీలో రేకుల షెడ్డులో నివాసం ఉంటున్న ఇబ్రహీం, మమతల గృహాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ గృహ పథకంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. తన భర్త మృతి చెందాడని, తాను కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నట్లు మమత కలెక్టర్ దృష్టి తీసుకువచ్చారు. తనకు ఇందిరమ్మ గృహం మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరింది. ప్రస్తుతం ఉన్న రేకుల షెడ్డును తొలగించి గృహాన్ని నిర్మించుకుంటానని మమత కలెక్టర్‌కు సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మల్హారి, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

**లబ్ధిదారుల ఎంపికకు గ్రామాల్లో విచారణ**

ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామాల్లో విచారణ చేపడుతున్నట్లు ఎంపీడీవో నరేశ్ తెలిపారు. ఇందిరమ్మ గృహాల కోసం వచ్చిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారి స్థితిగతులపై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని బాణాపూర్ తండా, బాయంపల్లి, అయ్యపల్లి, అయ్యపల్లి తండాల్లో బుధవారం విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఎంపీడీవో వెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

**భూ భారతి చట్టంపై అవగాహన**

రామారెడ్డి(గాంధారి), ఏప్రిల్ 23 : భూ భారతి చట్టంపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. గాంధారిలోని రైతులకు బుధవారం నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఆధార్ కార్డు తరహాలో రైతులకు భూదాన్ కార్డులు జారీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గాంధారి తహసీల్దార్ రేణుకాచౌహాన్, ఎంపీడీవో రాజేశ్వర్, మండల స్పెషల్ ఆఫీసర్ మురళి, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



లింగంపేటలో రేకుల ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## 'చలో వరంగల్' పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మద్నూర్, ఏప్రిల్ 23 : మండలంలోని ధన్నూర్ గ్రామంలో బీఆర్ఎస్ మండల నాయకులు చలో వరంగల్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరు కార్యకర్త కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు బస్సీపటేల్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోవింద్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో మహిళ హత్య



లక్ష్మి ఇంటి సమీపంలో సంచరిస్తున్న డాగ్ స్క్వాడ్



అమ్ముల లక్ష్మి (ఫైల్)

లింగంపేట, ఏప్రిల్ 23 : మండల కేంద్రానికి చెందిన అమ్ముల లక్ష్మి(40)ని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లు ఎస్సై వెంకట్‌రావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి భర్త మృతి చెందడంతో కూలీ పని చేసుకొని జీవనం కొనసాగిస్తున్నది. గత ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం దుండగులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం ఇంట్లోంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఇంటికి ఉన్న తాళం పగులగొట్టి తలుపులు తెరిచి చూడగా మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. వివరాల సేకరణ కోసం క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. లక్ష్మి ఇంట్లో ఉన్న వస్తువులు చిందరవందగా ఉన్నాయి. ఇంట్లో చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు విలువైన వస్తువుల కోసం గాలించినట్లు గుర్తించామని తెలిపారు. లక్ష్మి మెడకు ఉరి వేసినట్లు గుర్తించామని తెలిపారు. మృతురాలి కూతురు శిరిష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ పరిశీలించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని ఎస్సై వెల్లడించారు.

## ఇంటర్ పరీక్ష ఫీజును చెల్లించాలి

కామారెడ్డి, ఏప్రిల్ 23 : ఇటీవల ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాలు వెల్లడైన సందర్భంగా ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఇంటర్మీడియేట్ మొదటి, రెండో సంవత్సరం పరీక్ష ఫీజును చెల్లించాలని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు పరీక్ష ఫీజును చెల్లించాలని సూచించారు. ఇంటర్మీడియేట్ పరీక్షలు మే 22 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## సబ్‌సెంటర్ తనిఖీ

రామారెడ్డి, ఏప్రిల్ 23 : మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో ఉన్న సబ్‌సెంటర్‌ను మండల వైద్యాధికారి డాక్టర్ సురేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నపిల్లల టీకాలు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సబ్ సెంటర్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఏఎన్‌ఎం జ్యోతి మాట్లాడి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. వేసవికాలం దృష్టిలో పెటుకొని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.

## చలివేంద్రం ప్రారంభం

లింగంపేట(తాడ్వాయి), ఏప్రిల్ 23 : తాడ్వాయి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ బుధవారం ప్రారంభించారు. వేసవిలో ఎండలు తీవ్రంగా ఉన్నందున గ్రామస్తులతోపాటు ప్రయాణికుల సౌకర్యార్థం చలి వేంద్రం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తాగు నీరు నిత్యం అందుబాటులో ఉంచాలని సూచించారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

## వ్యవసాయ కార్మికుల సమగ్ర చట్టాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కిశోర్

కామారెడ్డి, ఏప్రిల్ 23 : వ్యవసాయ కార్మికుల సమగ్ర చట్టాన్ని అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కిశోర్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా 60 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి బతుకున్నారన్నారు. రాష్ట్రంలో 55 శాతం పైగా వ్యవసాయ కూలీలు ఉన్నారని చెప్పారు. వీరికి ఏడాది పొడవునా పని దొరకడం లేదన్నారు. పని దొరికినా.. వచ్చిన కూలితో కుటుంబం గడవం లేదన్నారు. పొట్ట చేత పట్టుకొని పట్టణాలకు వలస వెళ్లి అక్కడ మున్సిపాలిటీ కార్మికులుగా డ్రైనేజీల్లో పనిచేస్తున్న పరిస్థితి నెలకొందని అన్నారు. గ్రామాల్లో ఉపాధి పనికి వెళ్తే సరైన కూలి చెల్లించకపోగా డబ్బులు సకాలంలో రావడం లేదని అన్నారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం కూలీలకు నెలకు రూ.2 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 3 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల డబ్బులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. లేని పక్షంలో కలెక్టర్, ఎంపీడీవో కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రకాశ్, కిశోర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాజంపేట్, ఏప్రిల్ 23 : మండలంలోని ఆర్గొండ సొసైటీ పరిధిలో ఉన్న కొండాపూర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ కంది శివరాములు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సంగ్యా నాయక్, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారిణి శృతి, ఏఈవో రజిత, ఏఎంసీ డైరెక్టర్లు బాలరాజు, సాయాగౌడ్, సొసైటీ సెక్రటరీ సాయిలు, గ్రామ సెక్రటరీ శ్రీజ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొండాపూర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



వైకల్యం ఉన్న పిల్లలకు కిట్లు అందజేస్తున్న జిల్లా న్యాయ సేవా సంస్థ సెక్రటరీ నాగరాణి

మాచారెడ్డి, ఏప్రిల్ 23 : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కామారెడ్డి సెక్రటరీ నాగరాణి అన్నారు. మాచారెడ్డి మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో బుధవారం నిర్వహించిన న్యాయ సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. చట్టాలపై అవగాహన ఉండాలని, బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దని సూచించారు. 14 ఏండ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని అన్నారు. ఆడపిల్లలపై అసభ్యకరంగా ప్రవర్తించిన వారి వివరాలు తెలియజేయాలని, వారిపై పోక్సో కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అంగవైకల్యం ఉన్న వారిని చిన్నచూపు చూడొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో దేవేందర్‌రావు, మాచారెడ్డి జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం వెంకటాచారి, ఐఆర్పీ మంజుల, ఫిజియోథెరపిస్ట్ నవీన్, శ్రావణ్, నరసింహాచారి, సందీప్, సీఆర్పీలు సంజీవ్, నరేశ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల సందర్శన



నెమ్లి పాఠశాలలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో అశోక్ కుమార్

బాన్సువాడ రూరల్/నస్రుల్లాబాద్, ఏప్రిల్ 23 : బాన్సువాడ మండలం దేశాయిపేట్, నస్రుల్లాబాద్ మండలం నెమ్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి అశోక్ కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యపై ఆరా తీశారు. వేసవి కాలంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వచ్చే సంవత్సరం కూడా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల సరళిని అడిగి తెలుసుకున్నారు. తన విద్యాభ్యాసం దేశాయిపేట పాఠశాలలో కొనసాగిందని, జిల్లా విద్యాధికారిగా పాఠశాలను సందర్శించడం ఆనందంగా ఉందని అన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

## రైతులు దరఖాస్తు చేసుకోవాలి



జల్దిపల్లి గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

లింగంపేట, ఏప్రిల్ 23 : భూసమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని కామారెడ్డి డివిజన్ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. లింగంపేట మండలం జల్దిపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సబ్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిష్కారానికి నోచుకోకుండా మిగిలిపోయిన సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రైతులు చేసుకున్న దరఖాస్తులపై మే 1 నుంచి 30వ తేదీ వరకు విచారణ చేపట్టనున్న ట్లు వెల్లడించారు. భూ సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. రెండు గ్రామాల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ఎల్లారెడ్డి డివిజన్ ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ సురేశ్, నాయబ్ తహసీల్దార్ రాందాస్, గిర్దావర్ కిరణ్‌తోపాటు అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పరిశీలన



వివరాలు సేకరిస్తున్న అధికారులు

నిజాంసాగర్, ఏప్రిల్ 23 : ఇందిరమ్మ ఇండ్ల స్థలాలను అధికారులు బుధవారం పరిశీలించారు. నిజాంసాగర్ మండలం అచ్చంపేట, బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ఆమోదించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల స్థలాలను నిజాంసాగర్ మండల అభివృద్ధి అధికారి గంగాధర్ పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

**లబ్ధిదారుల వివరాలు..**

రామారెడ్డి(గాంధారి), ఏప్రిల్ 23 : గాంధారిలో ఎంపీడీవో రాజేశ్వర్ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాలను పంచాయతీ సెక్రటరీ నాగరాజుతో కలిసి బుధవారం పరిశీలించా రు. అర్హుల జాబితాలో ఉన్న వారుఇండ్లు నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉన్నారా? ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. లబ్ధిదారులు మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్మిస్తున్న(మాడల్) నమూనా ఇందిరమ్మ ఇల్లును చూడాలని ఆయన సూచించారు. పంచాయతీ సిబ్బంది తిరుపతి, వంశీ రవి పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బిచ్కుంద, ఏప్రిల్ 23 : మండల కేంద్రంలోని 13వ వార్డులో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను బుధవారం స్థానిక మండలాధ్యక్షుడు గంగాధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట కమిటీ డైరెక్టర్ సాయిని అశోక్, యోగేశ్, ఖలీల్, సీమ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలి

### ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి,ఏప్రిల్ 23 : పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలని ఎస్పీ రాజేశ్‌చంద్ర అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం నెల వారి సమీక్షా సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు పరిమితికి లోబడి ఉండాలని, గ్రేవ్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ విషయంలో ఎస్‌వోపీ తప్పకుండా పాటించాలని అన్నారు. ప్రతి కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్‌తో త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నకుండా సైన్ బోర్డులను ఏర్పాటు చేయించాలని సూచించారు.

తరుచూ వాహనాల తనిఖీ నిర్వహిస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని చెప్పారు. ముఖ్యంగా ఫేక్ నంబర్ ప్లేట్స్, నంబర్ ప్లేట్స్ మార్పుపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అనంతరం ఇటీవల పట్టణంలోని జయశంకర్ కాలనీ రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం చేసిన మహిళను గమనించి కాపాడిన బ్లూ కోర్టు సిబ్బంది నరసింహులు, హోంగార్డు వసంత్‌కు జిల్లా రివార్డు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఏఎస్పీ చైతన్య, డీఎస్పీలు శ్రీనివాస్ రావు, సత్యనారాయణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జార్జి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మురళి, పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

## మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 23 : పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ మారెడ్డి రజితారెడ్డి అధ్యక్షతన బుధవారం సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో భాగంగా మార్కెట్ కమిటీ 2024–25 సంవత్సరం ఆదాయ–వ్యయాలను చదివి వినిపించారు. అనంతరం గత సమావేశంలో చేసిన తీర్మానాలపై సమీక్ష చేపట్టారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జొన్నల రాజు, సభ్యులు ముప్పిడి హరినారాయణ, లక్ష్మీనారాయణ, గంగారెడ్డి, శంకరయ్య, కార్యదర్శి శ్రీకాంత్, సిబ్బంది శశి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



కామారెడ్డిలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కామారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 23 : జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద మంగళవారం జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఉగ్రవాదుల దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. జమ్మూకాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడి అతి హేయమైనదని అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో 26మంది భారతీయులు, ఇద్దరు విదేశీయులపై జరిగిన ఉగ్రవాదుల దాడి అత్యంత బాధాకరమన్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

లింగంపేట(తాడ్వాయి), ఏప్రిల్ 23 : గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత శిక్షణ శిబిరాన్ని గ్రామానికి చెందిన యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ స్వరాజ్యం స్వచ్ఛంద సంస్థ కామారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి సూచించారు. తాడ్వాయి మండలం కరడ్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వేసవిలో సమయాన్ని వృథా చేసుకోకుండా కుట్టు శిక్షణకు హాజరుకావాలని సూచించారు. టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నందున గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించడంతోపాటు రాయితీపై కుట్టు మిషన్లు అందించనున్నట్లు వెల్లడించారు. గ్రామస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శితోపాటు గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బాన్సువాడ, ఏప్రిల్ 23 : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి ప్రమీల అన్నారు. బాన్సువాడలోని లక్ష్మీనర్సింహా కల్యాణ మండపంలో పోషణ్ పక్వాడ్ పక్షత్సవాల్లో భాగంగా బుధవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందరర్భంగా ఆమె మా ట్లాడుతూ.. పౌష్టికాహారం ప్రాముఖ్యతను బాలింతలు, గర్భిణులకు వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో సౌభాగ్య, ఎంపీడీవో బషీరుద్దీన్, యూనిసెఫ్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ మోహన్, ఎంఎల్‌హెచ్‌పీ నరేందర్, పోషణ్ అభియాన్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ప్రియ, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

**చిన్నారులకు సృజనాత్మక విద్య..**

లింగంపేట, ఏప్రిల్ 23 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సృజనాత్మక విద్య అందిస్తున్నట్లు ఎల్లారెడ్డి సీడీపీవో స్వరూపరాణి సూచించారు. లింగంపేట మండలంలోని లింగంపల్లి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నారులకు విద్యపై అవగాహన కల్పించడానికి ఆటపాటలతో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అన్నప్రాసన, సామూహిక సీమంతాలు, పోషణ్ పక్వాడ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ హస్లీ, ఏఎన్ఎం రాజమణి, కార్యదర్శి భవానీ పాల్గొన్నారు.

**సామూహిక సీమంతాలు**

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 23 : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అంగన్‌వాడీ టీచర్ మంజుల తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సుజన, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఏఎన్ఎం ఇందిర, ఆశకార్యకర్త అఫీనా, గ్రామానికి చెందిన పలువురు గర్భిణులు పాల్గొన్నారు.



లింగంపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో స్వరూపరాణి



వెంకటాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న సామూహిక సీమంతాలు

## నేడు భూ భారతి చట్టంపై అగాహన కార్యక్రమం

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 23 : మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో గురువారం భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవగాహన సదస్సుకు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

**25న బిచ్కుందలో..**

బిచ్కుంద, ఏప్రిల్ 23 : బిచ్కుందలో భూ భారతి అవగాహన సదస్సు ఈ నెల 25న నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభరతి చట్టంపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించడానికి స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో కలెక్టర్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## మహిళ ఆత్మహత్య

లింగంపేట, ఏప్రిల్ 23 : లింగంపేట మండలం ఎక్కాపల్లి గ్రామానికి చెందిన ల్యాగల లక్ష్మి(45) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకట్‌రావు తెలిపారు. ల్యాగల లక్ష్మిలో కొంత కాలంగా మానసికంగా మార్పు వచ్చినట్లు తెలిపారు. లక్ష్మికి దవాఖానల్లో వైద్యం చేయించినా నయం కాలేదు. మంగళవారం రాత్రి భోజనం చేసి కుటుంబ సభ్యులు పడుకున్న తర్వాత ఇంటి పక్కన ఉన్న బాత్ రూం సమీపంలోని దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం చూడగా మృతి చెందిఉంది. లక్ష్మి భర్త పర్వయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

**చెరువులో దూకి మరొకరు..**

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 23 : బీర్కూర్ శివారులోని భజన్ చెరువులో దూకి నేనావత్ హిర్కిబాయి(67) ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నస్రుల్లాబాద్ మండలం బొప్పాస్ పల్లి గ్రామానికి చెందిన హిర్కిబాయి భర్త కొన్ని నెలల క్రితం మృతి చెందాడు. కొంత కాలంగా బీర్కూర్ మండల కేంద్రంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగించేది. భజన్ చెరువుపై మృతురాలి సంచిని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని వెలికి తీసి పంచనామా చేసినట్లు తెలిపారు.

## పిల్లల కోసం సమయం కేటాయించాలి

నిజాంసాగర్, ఏప్రిల్ 23 : ప్రతిరోజూ తల్లిదండ్రులు పిల్లలతో కొంత సమయాన్ని గడపాలని ప్రధానోపాధ్యాయుడు బాలచందర్ అన్నారు. మహ్మద్‌నగర్ మండలం కోమలంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు చెప్పే కథలు వినాలని, తల్లిదండ్రులు కూడా కథలు చెప్పాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యాయులు హన్మాండ్లు, గంగాధర్, మీరన్, సాయిలు, బధ్యానాయక్, రజిని, వసుంధర, సంతోష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.